సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



మేడ్చల్: మరమ్మతులు, చెట్ల నరికివేత కారణంగా గురువారం ఎల్లంపేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పవన్‌చందు తెలిపారు. ఇందులో భాగంగా ఎల్లంపేట్ గ్రామం, గ్రామ పరిధిలోని అన్ని డొమెస్టిక్, ఇండస్ట్రియల్, అగ్రికల్చర్ సర్వీస్‌లకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

మేడ్చల్ సబ్‌స్టేషన్ పరిధిలో...

మరమ్మతులు, చెట్ల నరికివేత కారణంగా మేడ్చల్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌జీఓ కాలనీ, వినాయక్‌నగర్, బాలాజీనగర్, కేఎల్ఆర్ విజయానగర్, ఉమానగర్, ఎంఆర్ఆర్ కాలనీ, కోర్టు రోడ్డు, కింది బస్తీ, కంట్రీక్లబ్, ఇందిరానగర్, సూర్యనగర్లలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి చెప్పారు.

24, 25 తేదీల్లో స్పోర్ట్స్ మీట్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 24, 25వ తేదీల్లో విద్యార్థినులకు ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ మీట్–2కే23 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత తెలిపారు. విద్యార్థినుల్లో మానసిక దృఢత్వం పెంపొందించడానికి క్రీడలను నిర్వహిస్తున్నామని, వివిధ కళాశాలల నుంచి విద్యార్థినులు పాల్గొనున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ మీట్‌లో పెద్ద ఎత్తున విద్యార్థినులు పాల్గొని క్రీడా రంగంలో మహిళల సత్తా చాటాలని ఆమె కోరారు.

క్లుప్తంగా...

వివాదంలో ప్రభుత్వ స్థలం

పోచారం: అన్నోజిగూడ ఎల్ఎన్ కాలనీలోని మినీ ఫంక్షన్ హాల్ వద్ద గల ప్రభుత్వ భూమిని బుద్ధ విహార్ కోసం కేటాయించినట్లు స్థానిక మరాఠీలు చెబుతున్నారు. కాగా ఈ స్థలంలో కొంత భాగాన్ని ఆంజనేయ స్వామి ఆలయం కోసం ఇవ్వాలని కొందరు కోరడంతో ఇరు వర్గాల మధ్య విభేదాలు తలెత్తి ఉద్రిక్తతకు దారితీసింది. పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు బుధవారం కొందరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని వివాదాస్పద స్థలం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగులో కౌన్సిలర్ మల్లికార్జున్

మేడ్చల్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ అన్నారు. 13వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించిన ఆయన అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. ఈ శిబిరంలో వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

కొర్రెముల్ కార్యదర్శిపై డీపీఓకు ఫిర్యాదు



డీపీఓకు ఫిర్యాదు చేస్తున్న కొర్రెముల్ పాలకవర్గ సభ్యులు

ఘట్‌కేసర్: నకిలీ ఎల్ఆర్ఎస్ పత్రాలతో ఇంటి అనుమతులిచ్చి పంచాయతీ ఆదాయానికి గ్రామ కార్యదర్శి గండి కొడుతున్నారని ఆరోపిస్తూ కొర్రెముల్ పాలకవర్గ సభ్యులు డీపీఓ రమణామూర్తికి బుధవారం ఫిర్యాదు చేశారు. పాలకవర్గ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా మహిళ వార్డు సభ్యులను హేళన చేస్తోందని పేర్కొన్నారు. పాలకవర్గం తీర్మానం చేసిన పనులు పక్కన పెట్టి ఆమెకు లాభమొచ్చే పనులు చేయిస్తోందని, ఎందుకని ప్రశ్నిస్తే మీకు ఏమీ తెలియదంటుందన్నారు. కొర్రెముల్‌లో మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నందున తక్షణమే కార్యదర్శిని బదిలీ చేయాలని కోరారు. డీపీఓకు ఫిర్యాదు చేసిన వారిలో ఈశ్వరీ, దుర్గరాజ్, భార్గవి, బాబు, స్వామి, సుష్మ, లక్ష్మి ఉన్నారు.

మైదానాలిట్టా.. ఆటలాడేదెట్టా?



మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఆట స్థలాలున్నా నిర్వహణ లేక ఆడలేని దుస్థితి

- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఉత్తమ క్రీడాకారులను వెలికితీసే ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు
- జిల్లాలో ప్రాంగణాల సంఖ్య 281.. పూర్తయింది మాత్రం 106 మాత్రమే..
- పూర్తయిన వాటిలోనూ.. అరకొర వసతులే..
- నిరాశలో క్రీడల్లో శిక్షణ పొందాలనుకునే యువత





సాక్షి,మేడ్చల్ జిల్లా: గ్రామీణ, పట్టణాల్లోని చిన్నారులు, యువతను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పంచాయతీ, పురపాలక సంఘాల పరిధిలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఆర్భాటంగా వాటిని ప్రారంభించినప్పటికీ నిర్వహణ మరిచిపోవడంతో అలంకార ప్రాయంగా మారాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువత, చిన్నారులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి నీరు గారుతోంది.

జిల్లాలో 281 క్రీడా మైదానాలకు అనుమతి..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 61 పంచాయతీలతో పాటు 13 పట్టణాల్లో కలిపి 281 క్రీడా ప్రాంగణాలకు ప్రభుత్వం అనుమతిని ఇచ్చినప్పటికీ ప్రభుత్వ స్థలాల కొరతతో ప్రాంగణాల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 106 పూర్తి చేయగా, మరో 19 ప్రగతిలో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ప్రారంభించిన క్రీడా ప్రాంగణాల్లో ఇప్పటి వరకు సరైన వసతులు కల్పించకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మైదానాల్లో మరమ్మతులు సరిగా చేయకపోవడంతో పాటు అవసరమైన వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయలేదని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు వృథా...

పంచాయతీలు, పట్టణ ప్రాంతాల్లో అర ఎకరం నుంచి ఎకరం విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించటంతో పాటు క్రీడా పరికరాలు, మౌలిక వసతుల కల్పనకు ఒక్కో ప్రాంగణానికి రూ.2.5 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు నిధులు వెచ్చించింది. జిల్లాలో ఇప్పటి వరకు 106 తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు సుమారుగా రూ.3.18 కోట్లు వెచ్చించినా 40 శాతం క్రీడా ప్రాంగణాలను లేఅవుట్లు, పార్కు స్థలాల్లో నిర్మాణాలు చేపట్టినట్లు గ్రామీణ క్రీడాకారులు పేర్కొంటున్నారు. యువత, చిన్నారులు ఆటలు ఆడేందుకు మైదానం తయారు చేయించడం, వాటిల్లో వాలీబాల్, ఖోఖో కోర్టులతో పాటు యువతకు లాంగ్ జంప్ చేసేందుకు వీలుగా తీర్చిదిద్దడం, సింగిల్, డబుల్ బార్ ఏర్పాటుతో సహా చుట్టూ మొక్కలు నాటించడం, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే స్థలాల కొరత కారణంగా గ్రామాలకు దూరంగానూ, కొద్దిపాటి ఖాళీ స్థలాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణం పేరిట బోర్డులు, వాలీబాల్ పోల్స్ నాటి, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసి వదిలేశారు. దీంతో నిధులు వెచ్చించినా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. పలు ప్రాంగాణాల్లో క్రీడా సామగ్రి లేకపోవడంతో పాటు శిక్షకుల నియామకం కూడా జరగలేదు. ముఖ్యంగా క్రీడా ప్రాంగణాలకు చాలా చోట్ల ప్రహరీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందిగా ఉంది.

- పలు పంచాయతీల్లో బిల్డర్లు, పలు సంస్థల సహకారంతో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి పరిచి పరికరాలు సమకూర్చినట్లు పత్రాలు చూపించి.. బిల్లులు కూడా కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- మిగతా చోట్ల క్రీడా ప్రాంగణాలకు స్థల సేకరణ ఇబ్బందిగా మారడంతో నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలు లేకపోలేదు.

నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని హెచ్చరించినా..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల నిర్వహణ బాధ్యత పంచాయతీలకు అప్పగించగా.. పట్టణాల్లో వాటిని పురపాలక సంఘాలు అప్పగించారు. క్రీడా ప్రాంగణాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని అధికార యంత్రాంగం హెచ్చరించినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవని క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు.

అభివృద్ధిని ఆగనివ్వం: మేయర్ కావ్య



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావ్య

జవహర్‌నగర్: కార్పొరేషన్ మంచి పట్టణంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా జవహర్‌నగర్‌లో అభివృద్ధి ఆగనివ్వకుండా ఉరుకులు పెట్టిస్తున్నామని మేయర్ మేకల కావ్య అన్నారు. బుధవారం 5వ డివిజన్‌లో కార్పొరేటర్ ఏకే మురుగేష్‌తో కలిసి రూ.5లక్షల వ్యయంతో చేపట్టే అంతర్గత డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గతంలో జవహర్‌నగర్‌లోని ప్రతి డివిజన్‌లో అడుగు తీసి అడుగేయలేని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం మంత్రి మల్లారెడ్డి సహకారంతో కార్పొరేషన్‌కు మరో రూ.25 కోట్లు మంజూరు చేయించి చాలా డివిజన్లలో సమస్యలు తీరుస్తున్నామని అన్నారు. అభివృద్ధిని చూసి కొందరు ఓర్వలేక ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని, వారంతా ఒకసారి అభివృద్ధిని పరిశీలించి మాట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బింగి లావణ్యసతీష్‌గౌడ్, టీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు సింగన్న బాలరాజ్‌పటేల్, నాయకులు బూడిద బాలరాజు, ఎ.రాజు, కృష్ణయాదవ్, పృధ్వి, డాక్టర్ చంద్రమౌళి, యాదగిరిగౌడ్, ఆర్.రాజు, ఎస్.సంతోష్, మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి, యాకమ్మ, విమల, మహేశ్వరి, మల్లమ్మ, నాగలక్ష్మి, రేఖ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలో పెంచుతున్న మొక్కలను సంరక్షించండి

కీసర: గ్రామాల్లో గల నర్సరీల్లో పెంచుతున్న మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ జిల్లా అధికారి పద్మజారాణి అన్నారు. బుధవారం మండలంలోని యాద్గార్‌పల్లి, గోధుమకుంట, కరీంగూడ తదితర గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న నర్సరీలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీల్లో పెంచుతున్న మొక్కల వివరాలు, వాటి పెంపకం పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు రాజు, ఆకిటి మహేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, గ్రామ కార్యదర్శులు సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నించిన వారిపై కేసు

ఘట్‌కేసర్: ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన వారిపై ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాలు ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ సర్వే నంబర్.3/1లోని ప్రభుత్వ భూమిని శంకర్, బాలాజీ, భీమా, రాజు, శాంబా మరి కొందరితో కలిసి 300 గజాల స్థలంలో అక్రమంగా గదిని నిర్మించాలని ప్రయత్నించారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారంటూ టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ రామ్‌కుమల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. టీపీఎస్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించామన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జాకు యత్నిస్తే వారిని ఉపేక్షించేది లేదని సీఐ అశోక్‌రెడ్డి హెచ్చరించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో పట్టు సాధించాలి



జేఎన్‌టీయూహెచ్ ప్రిన్సిపాల్ జయలక్ష్మిని సన్మానిస్తున్న మాధవీలత

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో పట్టు సాధించాలని జేఎన్‌టీయూహెచ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం కేంబ్రిడ్జ్ ఎంపవర్ సీ1 అడ్వాన్స్ లెవల్ గ్రాడ్యుయేషన్ జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రసార నైపుణ్యాలను పెంచుకోవాలని, కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితమైతే భవిష్యత్‌లో ఎదగలేరన్నారు. అనంతరం సీ1 అడ్వాన్స్ లెవల్ పూర్తి చేసిన తృతీయ, చివరి సంవత్సరం విద్యార్థినులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయించాలని మంత్రికి వినతి



మసీద్ కమిటీ సభ్యులతో కలిసి మంత్రికి వినతి పత్రం ఇస్తున్న చైర్ పర్సన్ పావనీయదవ్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కొండాపూర్ సర్వే నంబర్.152లో ఎకర భూమిని ముస్లిం కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు కేటాయించాలని చైర్‌పర్సన్ పావనీయాదవ్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డికి బుధవారం వినతి అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి కలెక్టర్‌తో మాట్లాడి ఇప్పిస్తానని హామీనిచ్చారు. మంత్రికి వినతి పత్రం అందజేసిన వారిలో కీసరగుట్ట డైరెక్టర్ నరేశ్‌గౌడ్, మజీద్ కమిటీ అధ్యక్షుడు అన్ను తదితరులు ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ అమయ్‌కుమార్



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం కంటికి సంబంధించిన ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి పేదోడికి ఉపయోగపడేలా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కంటి వెలుగులో అనుభవం ఉన్న కంటి వైద్యులతో ఉచితంగా కంటి పరీక్షలు చేయించడంతో పాటు అవసరమైన వారికి కళ్లద్దాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా డిప్యూటీ విస్తరణ మీడియా అధికారి వేణుగోపాల్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు

ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలి

మేడ్చల్‌రూరల్: ప్రతి ఒక్కరూ తమ వంతుగా సమాజ సేవ చేయాలని సీఎంఆర్ఐటీ కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాలలో ప్రపంచ స్కౌట్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రవేశిక సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కోఆర్డినేటర్ ప్రవీణ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ పాలనలో స్థానిక సంస్థలు నిర్వీర్యం'

ఘట్‌కేసర్: బీఆర్ఎస్ పాలనలో స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ఘనాపూర్ పంచాయతీ కార్యాలయానికి విద్యుత్ సరఫరాను నిలిపివేయడంపై స్థానిక సర్పంచ్ గోపాల్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామాల్లో ప్రజలు చెల్లించిన ఇంటి పన్నుల డబ్బులు ప్రభుత్వం వాడుకోవడంతోనే పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని, చెక్కులు పాస్ చేయకపోవడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతమైతే సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.



పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి

పేదల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



బాధిత కుటుంబానికి ఎల్ఓసీని అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: నిరుపేదల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్‌లోని నాచారం ఫైర్ విక్టమ్స్ కాలనీకి చెందిన సావిత్రికి ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా రూ.లక్ష మంజూరు చేసి ఎల్ఓసీని బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు మేయర్ మేకల కావ్య సమక్షంలో మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కష్టాల్లో ఉన్న పేదలకు అన్ని విధాల సహాయ, సహకారాలను అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుంటుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బింగి లావణ్యగౌడ్, డీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, పరమేష్‌చారి, పద్మారావు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం పుణ్యక్షేత్రానికి శివ మాలధారులు



జ్యోతిర్ముడిలతో శ్రీశైలంకు బయల్దేరుతున్న శివ మాలధారులు

మేడ్చల్: అత్వెల్లి శ్రీపార్వతీ రాజరాజేశ్వరి శివాలయంలో దేవత విగ్రహాల ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభం సందర్భంగా మండల కాలం పాటు శివదీక్షలు చేపట్టిన శివ మాలధారులు బుధవారం జ్యోతిర్ముడిలు కట్టుకుని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బయల్దేరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సరిత మల్లేష్‌గౌడ్, గురుస్వాములు శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఆర్‌కే, మాలధారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

మేడ్చల్‌రూరల్: ఎల్లంపేట్ గ్రామంలోని పలు వార్డుల్లో భూగర్భ డ్రైనేజీ పనులకు బుధవారం గ్రామ సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.15 లక్షల వ్యయంతో చేపడుతున్న పనులకు ఆయన పూజలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోప గణేశ్, గ్రామ కార్యదర్శి రవిందర్‌రెడ్డి, వార్డు సభ్యులు రమేశ్, రామకృష్ణ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రామకృష్ణుడు తదితరులు

జీవాలకు నట్టల నివారణ మందులు వేయించాలి



జీవాలకు నట్టల నివారణ మందు వేయిస్తున్న చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు



మేడ్చల్‌లో జీవాలకు నట్టల నివారణ మందులు వేస్తున్న దృశ్యం

మేడ్చల్: రైతులు తమ గొర్రెలకు తప్పకుండా నట్టల నివారణ మందులు వేయించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు కోమురయ్య కోరాడు. మేడ్చల్, రావల్‌కోల్‌లలో ఆయన పశువైద్యులతో కలిసి జీవాలకు నట్టల నివారణ మందులు వేశారు. పెంపకందారులు ఫిబ్రవరి, జూన్, అక్టోబర్ నెలలో తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోపని వెంకటేశం, సర్పంచ్ మహేందర్, నాయకులు ఆకుల శ్రీనివాస్, భాస్కర్, ఏడీఏ జైకుమార్, పశువైద్య బృందం, కురుమూర్తి, నవీన్‌కుమార్, కృష్ణ, సంఘం నాయకులు పోచయ్య, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీ పరిధిలో...

కీసర: జీవాలకు నట్టల నివారణ మందులను తప్పకుండా వేయించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలో జీవాలకు నట్టల నివారణ మందులను వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ బలరాం తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి



సీఐ సీతారాంను అభినందిస్తున్న వెంకటేశ్వర్

జవహర్‌నగర్: ప్రజలు పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను బుధవారం దళిత సంఘర్షణ సమితి(డీఎస్ఎస్) నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ నాగరాజుగౌడ్, డీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బొల్ల పద్మారావు ముదిరాజ్, మేడ్చల్ జిల్లా సెక్రెటరీ సమ్మిరెడ్డి, జవహర్‌నగర్ అధ్యక్షుడు అందె నరేందర్, నాయకులు రజక నాగేష్, మామిడిపల్లి పరమేష్‌చారి, ఎం.సాయి, అరవింద్, సత్యనారాయణ, ప్రభాకర్ ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

సాక్షి,మేడ్చల్ జిల్లా: లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని జిల్లాలో పక్బందీగా అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ అధ్యక్షతన ప్రీ–కాన్సెప్షన్ అండ్ ప్రీ–నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (లింగ ఎంపిక నిషేధం) చట్టం అమలుపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం జరిగింది. పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం ఇప్పటికే ఉన్న ఇమేజింగ్ 23 కేంద్రాల పునరుద్ధరణ, చట్టాన్ని పకడ్బందీగా అమలు పరిచేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో జిల్లా సలహా కమిటీ ప్రతినిధులు చర్చించారు. ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతున్న తరుణంలో లింగ నిర్ధారణపై పరీక్షల నిర్వహణ చట్ట విరుద్ధమని, స్కానింగ్ కేంద్రాల్లో పర్మినెంట్ రికార్డులు మెయింటేన్ చేయడంతో పాటు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో స్కానింగ్ సమాచారాన్ని పొందుపరచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నోడల్ అధికారి, డిప్యూటీ విస్తరణ మీడియా అధికారి వేణుగోపాల్‌రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాఘవేందర్, డీపీఆర్ఓ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



మేడిపల్లి: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని బీఆర్ఎస్ నేత మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో బుధవారం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ నేత మర్రి రాజశేఖర్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర గొర్రెలు మేకల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, మల్లారెడ్డి హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రీతిరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లు, మేడిపల్లి సీఐ గోవర్ధన్ గిరి, బీఆర్ఎస్ నాయకులు పాశం బుచ్చియాదవ్, రాజేష్ నాయక్, మణిరామ్ నాయక్, దేవిసింగ్ నాయక్, శ్రీనునాయక్, రమేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.